క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

హుజూర్‌నగర్ : ప్రముఖ పారిశ్రామికవేత్త, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని 15 ఏళ్లలోపు బాల బాలికలకు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను సూర్యాపేటలో ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిరెడ్డి గణేష్, పారుపల్లి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ పోటీలలో పాల్గొనేవారు 29న ఉదయం 9 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. చెస్ బోర్డు కాయిన్స్‌తో క్రీడలకు రావాలని చెప్పారు. క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించినట్లు వారు తెలిపారు. ఇతర వివరాలకు 9491329171 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

సాయి మందిరానికి రూ. లక్ష విరాళం



దాత సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి నారాయణపురం గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు అట్టూరి సత్యనారాయణరెడ్డి తన భార్య అట్టూరి సావిత్రమ్మ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత సత్యనారాయణరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు పసుపులేటి భిక్షం, కోశాధికారి బి.మహేష్, ఉపాధ్యక్షుడు బి.ఉపేందర్, పూజారి రాజశేఖరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



అవినాష్‌గౌడ్

హుజూర్‌నగర్ : నాగాలాండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ (అండర్-25) పోటీలకు హుజూర్‌నగర్‌కు చెందిన యలక అవినాష్‌గౌడ్ ఎంపికయ్యారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవినాష్ హైదరాబాద్ జట్టు నుంచి ఎంపికై ఆదివారం నాగాలాండ్‌లో మూడవ మ్యాచ్‌లో ఆడనున్నారు. కాగా అవినాష్ స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో బీకామ్ కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. జాతీయ స్థాయికి ఎంపికైన అవినాష్‌ను ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాలేజీ చైర్మన్ పశ్య శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.రవీందర్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

వేపలసింగారంలో పశు వైద్య శిబిరం



ప్రారంభిస్తున్న సర్పంచ్ అన్నెం శిరీష

హుజూర్‌నగర్‌రూరల్ : పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని వేపలసింగారంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని మండల పశు వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పశు వైద్యులు కె.వీరారెడ్డి, సత్యావతి, సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిలుకూరు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాల సమీపాన కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డుపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామానికి చెందిన రాజేష్, నాగరాజులు బేతవోలు నుంచి పనినిమిత్తం కోదాడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరిలో రమేష్‌కు కాలు విరిగింది. నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని వారిని చికిత్స నిమిత్తం ఆటోలో కోదాడ వైద్యశాలకు తరలించారు.

అంశాలస్వామి మృతి బాధాకరం

నేరేడుచర్ల : ఫ్లోరోసిస్ వ్యతిరేక ఉద్యమకారుడు అంశాలస్వామి ప్రమాదంలో మరణించడం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యపై గత 30 ఏళ్లుగా మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లాడని తెలిపారు. ఆయన మృతి పట్ల సీపీఐ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు. అంశాలస్వామి అంతిమ ఘట్టాన్ని ప్రభుత్వం అధికార లాంఛనాలతో చేపట్టి కుటుంబసభ్యులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు వేళాయే..

కోదాడలోని బోడిగుట్టపై లింగమంతుల జాతర

- రెండు రోజులుగా కొనసాగుతున్న దేవతామూర్తుల ఊరేగింపు
- 1న విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం
- రెండు కోట్ల వ్యయంతో ఆలయాల నిర్మాణం



బోడిగుట్టపై నిర్మించిన లింగమంతులస్వామి ఆలయం



అభయాంజనేయస్వామి ఆలయం

కోదాడ : కోదాడ పట్టణ పరిధిలోని అనంతగిరి రోడ్డులో ఉన్న బోడి గుట్టపై రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన లింగమంతులస్వామి, అభయాంజనేయస్వామి దేవాలయాల ప్రతిష్ఠాపనోత్సవానికి అంతా సిద్ధమైంది. ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 11- 43 నిమిషాలకు విజయ గణపతి, అభయాంజనేయస్వామి, గంగాపార్వతీ సమేత లింగమంతుల స్వామి, చౌడమ్మ గురవమ్మ, సర్వమ్మ సహిత ఏచర్ల ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠాపనలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మేళ్లచెరువుకు చెందిన పురోహితుడు కొంకపాక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక ఆలయ పనులు సైతం 90 శాతం పూర్తి కాగా మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు.

ఊరంతా విగ్రహాల ఊరేగింపు..

కాగా, బోడిగుట్టపై గల ఆలయంలో ప్రతిష్ఠించే దేవతామూర్తుల విగ్రహాలను కోదాడ పట్టణంలోని ప్రతీ వీధిలో రెండు రోజులుగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. దీంతో ఇంటి ముందుకు వచ్చిన దేవా తామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఐదు రోజుల జాతర..

కోదాడలో లింగమంతుల ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం, అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. 2న ఎడ్ల పందాలు కనువిందు చేయనున్నాయి. 5వ తేదీన ఉదయం 11 గంటలకు దేవరపెట్టెను ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నివాసం నుంచి ఊరేగింపుగా గుట్టపై ఆలయం వద్దకు తీసుకెళ్లనున్నారు. అదేరోజు రాత్రి 8 గంటల నుంచి ఆడపడుచులు గంపలను ఎత్తుకొని ప్రదర్శనగా వెళ్లి రాత్రి 12 గంటల వరకు గుట్టపైకి చేరుకుంటారు. 6వ తేదీన ప్రభల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. 7న చంద్రపట్నం నిర్వహిస్తారు. 8న జాతర ఉత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కనుల పండువగా దేవతామూర్తుల ఊరేగింపు



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు

కోదాడ : పట్టణంలోని పుర వీధుల్లో బోడిగుట్టపై నిర్మించిన లింగమంతుల ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల ఊరేగింపును శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ముందుకొచ్చిన దేవాతామూర్తులకు పట్టణవాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 31వ తేదీ వరకు దేవతామూర్తుల ఊరేగింపు ఉంటుందని, ప్రతి ఇంటి ముందుకు ప్రతి ఇంటి ముందుకు దేవతామూర్తుల ఉన్న వాహనం వస్తుందని, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష

- ఎమ్మెల్యే సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, సర్పంచ్ మన్నెం శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ కె.సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నవీన్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీ భరత్‌నాయక్, రాజీవ్, శరభరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా 'కల్యాణలక్ష్మి'

ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేందుకే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకొచ్చారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 199 మందికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1.99 కోట్ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం



గరిడేపల్లి : తాళ్లమల్కాపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామంలో జంపాల సోషల్ సర్వీసు ఆశ్రమం, హ్యాండ్ ఆఫ్ కా హోప్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని, గ్రామంలో రూ. 35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన మాజీ సర్పంచ్ రాతికింది రామయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని కీతవారిగూడెం నుంచి మునగాల జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. తాళ్ల మల్కాపురంలో గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కడపు జ్యోతి గురువయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్ గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ వనజ, ఎంపీటీసీ రాములు, బాణోతు ఉషావెంకటేశ్వర్లు, అంజయ్య, వీరస్వామి తదితరులున్నారు.

ఎస్పీ కోటిరెడ్డికి పద్మావతి పరామర్శ



హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన నంద్యాల కోటిరెడ్డి (వికారాబాద్ ఎస్పీ) తండ్రి హనుమారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. శనివారం కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి.. కోటిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొప్పుల జైపాల్ రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, కాలె సామియేలు, ఎలక శ్రీలత, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సోమిరెడ్డి కుటుంబానికి పరామర్శ

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అల్లుబెల్లి సోమిరెడ్డి కుటుంబాన్ని శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరామర్శించారు. ఆమె వెంట మాజీ ఎంపీటీసీ అల్లుబెల్లి లావణ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లడ్డూ, కొబ్బరికాయల విక్రయానికి వేలం పాట

నేరేడుచర్ల : మండలంలోని బూర్గులతండా వద్ద గల సోమప్ప సోమేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రసాదాల విక్రయానికి శనివారం వేలం పాటను ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫిబ్రవరి 17 నుంచి 21వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల విక్రయానికి వేలంపాట నిర్వహించగా నేరేడుచర్లకు చెందిన ఎం.వెంకన్న రూ.85 వేలకు దక్కించుకున్నారు. లడ్డూ విక్రయ పాటను జి.శ్రీనివాస్‌రెడ్డి రూ.75 వేలకు దక్కించుకోగా, సైకిల్ స్టాండ్‌ను బూర్గులతండాకు చెందిన ఎం.సత్యం రూ.5 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ కమిటీ సభ్యులు వీరప్ప, సైదులు, పార్వతి, ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు రమణ నగేష్, రోజానాగు, ఉప సర్పంచ్ కొండ లక్ష్మమ్మ, వెంకన్న, నాగరాజు, భిక్షం, వెంకటయ్య, సుదర్శన్, రఫీక్, ఎలిషా, సుందర్, కందిబండ శ్రీనివాస్, వెంకట్రాంనాయక్ ఉన్నారు.

'మత్స్య' ఎన్నికలు నిలిపివేయాలని యత్నం



సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి శ్రీరాములు

మునగాల : మండలంలోని కలకోవలో మత్స్య సహకార సంఘం ఎన్నికలు జరగకుండా అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలోమాట్లాడారు. ఈ నెల 27న మత్స్య సొసైటీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఎన్నికలు నిలిపివేయాలని అధికారులకు లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికార పార్టీ నాయకులతో కలసి సంఘం సభ్యులను ఇబ్బందులకు గురిచేసినప్పటికీ న్యాయపరంగా గెలిచామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ అధికార పార్టీ అండదండలతో పలు అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, సుంకర పిచ్చయ్య, జూలకంటి విజయలక్ష్మి, మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షుడు అనంతు గుర్వయ్య, సభ్యులు మండవ వెంకటాద్రి, బుర్రి బాబు, లింగయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



హుజూర్‌నగర్‌లోని ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న పూజారులు, భక్తులు



నేరేడుచర్ల : పాయసం వండుతున్న వనితా క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీగోదాపద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శిరిడి సాయిబాబా మందిరంలో రథసప్తమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిత్య హృదయ పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల : రథ సప్తమి పర్వదినాన్ని మండల ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, విష్ణు సహస్ర పారాయణం చేశారు. వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆవు పేడతో తయారు చేసిన పిడకల పొయ్యిపై ఇత్తడి పాత్రలో పాయసం వండి సూర్యభగవానుడికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ముత్తైదువులకు వాయినం అందజేశారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరెల్లి శ్రీలత, పాలిశెట్టి సంధ్య, ఈగ భాగ్యలక్ష్మి, గరిణే అరుణ, వాసంతి, సువర్ణ, ఇందిర, కరుణ, పద్మ, రాధిక తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పాదపూజ



పారిశుద్ధ్య కార్మికుల పాదాలు కడుగుతున్న సాయిబాబా సేవా సంస్థ అధినేత వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల : సూర్య భగవానుడి జయంతి సందర్భంగా నేరేడుచర్లకు చెందిన సాయిబాబా సేవా సంస్థ అధినేత దేవరశెట్టి వెంకటేశ్వర్లు శనివారం ఆయన నివాసంలో పారిశుద్ధ్య కార్మికులకు పాదాలు కడిగారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, వైస్ చైర్ పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దేవరశెట్టి వెంకటేశ్వర్లు -కళావతి దంపతులు పాద పూజ చేసి వస్త్రాలు బహూకరించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపడుతూ వారిని ప్రోత్సహిస్తే మున్సిపాలిటీకి వారు మరిన్ని సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కోణతం చినవెంకట్‌రెడ్డి, రణపంగ నాగయ్య, అలక సరిత, నాగవేణి, నాయకులు మార్కెండేయ, శేఖర్‌రావు, సైదులు తదితరులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం సమావేశం



వెంకటేశ్వర్లుకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మాధవరాయిని గూడెం శాఖ అధ్యక్షుడిగా మేకల వెంకటేశ్వర్లును నియమిస్తూ పట్టణ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి చేపూరి నరసింహ చారి, మహిళా అధ్యక్షురాలు గూడెపు దీప నాయకులు కె.వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, కె.కృష్ణ, బ్రహ్మచారి, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద దళితులకే దళితబంధు ఇవ్వాలి



కోదాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ : నిరుపేదలైన దళితులకు మాత్రమే దళితబంధు ఇవ్వాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శనివారం కోదాడలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కలెక్టరేట్, ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దళితబంధు ఇవ్వడం సంతోషకరమని, కానీ రాజకీయ నాయకుల జోక్యం లేకుండా అర్హులైన నిరుపేదలకు దళితబంధు సక్రమంగా అందేటట్లు చూడాలన్నారు. నిజాయితీ గల ఐఏఎస్ అధికారుల సమక్షంలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరపాలన్నారు. ఫిబ్రవరి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాను, 19న ఇందిరపార్కు వద్ద జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో చింతాబాబు మాదిగ, బచ్చలకూరి నాగరాజు, ఆదినారాయణ, శ్రీను, వినోద్, మధు, నాగేశ్వరరావు, బాబురావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

హుజూర్‌నగర్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఎంఈఓలు సైదానాయక్, చత్రునాయక్ అన్నారు. జిల్లా జన విజ్ఞాన వేదిక వారు రూపొందించిన సైన్స్ క్యాలెండర్‌ను శనివారం హుజూర్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ మనుగడకు సైన్సే ప్రధాన కారణమని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం, బియ్యం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కౌన్సిలర్ భవాని, విజయ్

హుజూర్‌నగర్ : పట్టణంలోని చింతలబజారుకు చెందిన సింగం వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయడ్డారు. దీంతో శనివారం కౌన్సిలర్ గుంజ భవాని, యడ్ల విజయ్‌లు వెంకన్నను పరామర్శించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి తరఫున 50 కేజీల బియ్యం, కొంత నగదును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో వి.లక్ష్మయ్య, నాగార్జున, యాదగిరి, వెంకన్న, రమేష్, క్రాంతి, రామకృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి బియ్యం..

పట్టణంలో ఇటీవల భవనంపై నుంచి పడి గాయపడిన తమ్మిశెట్టి నరసింహాకు పట్టణ బీఆర్ఎస్ నాయకులు తండు సాయిరాం శనివారం 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రాము, శ్రీనివాస్, నరేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులో కాలు విరిగి ఇంట్లో ఉంటున్న చడపంగు రాంబాబుకు 25 కిలోల బియ్యం, మందా రాజుకు 25 కేజీల బియ్యాన్ని జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు డెక్కం గోపయ్య, సభ్యులు రమేష్, సత్యం, గోవిందు, లోకేష్, పాపారావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక ధర్నాను విజయవంతం చేయాలి

నడిగూడెం : ఢిల్లీలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న కార్మిక, కర్షకుల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు మల్లెల వెంకన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 40 రకాల కార్మికుల కోడ్‌లను 4 రకాలుగా కుదించిన మోదీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి ఏ.కృష్ణయ్య, నాయకులు పెంటుసాహెబ్, అమీనా, మహబూబా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

తుంగతుర్తి : జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేసి గీతకార్మికులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో గీత పనివారల సంఘం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గీత కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవన అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఆ సంఘం నాయకులు పులిపలుపుల సైదులు, రాజారాం, శ్రీనివాస్, కేశగాని సైదులు, సంతోష్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్త్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు వి జయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

పెద్దగట్టులో జాతర పనుల పరిశీలన



పెద్దగట్టు వద్ద పనులను పరిశీలిస్తున్న ఈఈ

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ ఈఈ జీకేడీ. ప్రసాద్ అన్నారు. పెద్దగట్టు ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యరావు, ఏఈ రాజురెడ్డి, ఎస్ఎస్ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు ఉద్యమిద్దాం

దురాజ్‌పల్లి : అమరవీరుల ఆశయాల సాధనకు ఉద్యమిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కొలిశెట్టి వజ్రమ్మ సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం జరిగిన పోరాటంలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్, డీటీఎఫ్ జిల్లా నాయకుడు దశరథ రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, శ్రీరాములు, మట్టిపెల్లి సైదులు, వెంకటేశ్వరరావు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, తదితరులు పాల్గొన్నారు.